క్లుప్తంగా

ప్లాస్టిక్‌ను అంతమొందించాలి



ప్లాస్టిక్‌పై విద్యార్థుల ప్రదర్శన

దర్శి: పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను అంతమొందించాలని కట్టశింగన్నపాలెం ప్రధానోపాధ్యాయుడు సుధాకరరావు అన్నారు. స్థానిక ఆ పాఠశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సుధాకరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు వివరించారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ బ్యాగ్ వాడితే కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణు ఏ వస్తువులు వాడితే మంచిదో, ఏ వస్తువులు వాడకం ప్రమాదమో తెలియజేస్తూ విద్యార్థులచే ప్రదర్శన చేయించారు. ఉపాధ్యాయులు హైమావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

భూయాజమానులు కౌలు రైతులకు సహకరించాలి



కౌలు హక్కు పత్రాలు ఇస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

తాళ్లూరు: భూ యాజమానులు కౌలు భూములు సాగు చేసుకొనే రైతులకు సహకరించాలని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న సూచించారు. మండల కేంద్రం తాళ్లూరులో దళిత బహుజన రిసోర్స్ ఆధ్వర్యంలో గురువారం కౌలు రైతుల హక్కుల గురించి ధ్రువీకరణ చట్టంపై ప్రచార చేశారు. తహసీల్దార్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతుల హక్కుల గురించి వివరించారు. దళిత బహుజన రిసోర్స్ రీజనల్ కో ఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ మోడల్ పాఠశాల తనిఖీ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని ఉర్దూ మోడల్ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ తనిఖీ చేశారు. ప్రార్థన నిర్వహణ, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధిపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీ మురళి, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బి–సర్టిఫికెట్లు అందజేత



ఎన్‌సీసీ బి–సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆర్మీ అధికారులు, ప్రిన్సిపాల్

కంభం: స్థానిక వాసవి విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 33 మంది ఇంటర్, 22 మంది డిగ్రీ విద్యార్థులకు గురువారం 34 ఆంధ్రా బెటాలియన్ అధికారి సుధీర్, జస్పాల్ సింగ్ బి–సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో దక్కే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో నిలవాలని ప్రిన్సిపాళ్లు వెంకటరెడ్డి, కె.రాము సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

అడ్డ దిడ్డం

- జాతీయ రహదారులపై పరిమితి లేని ప్రయాణం
- ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ఎక్కుతున్న యువకులు
- నియంత్రణ కోల్పోవడంతో జరుగుతున్న ప్రమాదాలు
- అయినా ద్విచక్ర వాహనదారుల్లో కనిపించని మార్పు



ఒకే బైకుపై వెళ్తున్న నలుగురు యువకులు

పెద్దదోర్నాల:

మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్, గుంటూరు, కర్నూల్ రోడ్లలో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయడంతో పాటు లైసెన్సులు లేని వారిపై భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ఆయా రోడ్లలో ప్రమాదాల శాతం ఎక్కువగా జరిగినా జరిమానాలు భారీగా విధించినా వాహనదారులు మాత్రం ఏ మాత్రం లెక్క చేయడం లేదు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ఎక్కువగా ప్రయాణించకూడదు. అలా బైక్‌లపై ఎక్కువ మంది ప్రయాణించటం ద్వారా ఎదురుగా ఉన్న ప్రమాదాన్ని తప్పించడం సాధ్యం కాదు. దీంతో సకాలంలో బ్రేకులు పడక పోవటం, వాహనం అదుపు తప్పటం, క్షణాల్లో జరిగిపోతుంటాయి. ఇలాంటి ప్రమాదాల్లో బాధితులకు ఇన్సూరెన్స్ సైతం లభించదని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో వాహనదారులు స్వీయ నిబంధనలు పాటించాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు.

జరిమానాలు విధిస్తున్నా కనిపించని మార్పు

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి పోలీసులు జరిమానాలు విధిస్తున్నా లెక్క చేయకుండా యథేచ్ఛగా తిరుగుతున్న యువకులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. జరిమానాలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వారిని పట్టుకొని నగదు వసూలు చేసే పనులు ముమ్మరం చేస్తున్నారు. ఇందుల్లో భాగంగా రోజూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ అతి వేగంగా వాహనాలు పడిపే వారు, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారు, పరిమితికి మించి ఎక్కువ మందితో ప్రయాణిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

అజాగ్రత్తే ప్రమాదాలకు కారణం

ఒకరిది నిర్లక్ష్యం, మరొకరిది అతి వేగం, ఇంకొకరిది అజాగ్రత.. ఇటువంటి కారణాలతో ప్రమాదాలు జరిగి ఎన్నో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. త్వరగా గమ్యం చేరుకోవాలన్న తాపత్రయం తప్ప వాహన వేగం, నడిపించే తీరు అదుపులో ఉండటం లేదు. మార్కెట్లోకి కొత్తగా వస్తున్న ద్విచక్ర వాహనాలపై యువకులు మోజు పడి రూ.లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. స్నేహితుల వద్ద ఉన్న వాహనాలతో పోటీ పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణకు పోలీసులు పలు చర్యలు చేపడుతున్నారు.

ఇద్దరికి మించి ప్రయాణిస్తే చర్యలు:



ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవు. వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించిన సందర్భాల్లో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే ఇన్సూరెన్స్ సైతం వర్తించదు. అ విషయాన్ని గమనించి ద్విచక్ర వాహనాలు నడపాలి. శ్రీశైలం ఘాట్ రోడ్డు, గుంటూరు రోడ్డులో యువకులు అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు పరిమితికి మించి ఎక్కువ మందితో ప్రయాణాలు కొనసాగించడం నేరం.

ఎస్సై మహేష్, పెద్దదోర్నాల

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

ముండ్లమూరు (దర్శి): గ్రామాల్లో కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శ్రీదేవి సూచించారు. మండలంలోని పూరిమెట్ల, ఈదర గ్రామ పంచాయతీలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు పంపించాలన్నారు. డోర్ టు డోర్ గార్బేజి కలెక్షన్ రోజూ అన్ని గ్రామ పంచాయతీల్లో విధిగా నిర్వహించాలని తెలియజేశారు. ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన పూరిమెట్ల, ఈదర గ్రామ పంచాయతీల ప్రజలకు ప్రత్యేకంగా గవర్నమెంట్ నుంచి ఫోన్లు వస్తున్నాయని, అన్ని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారని, ఎటువంటి నెగిటివ్ సమాధానాలు రాకుండా పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. రోడ్లకు ఇరు వైపులా చెత్తకుప్పలు ఉండరాదని, అలాంటి చెత్తకుప్పలు ఉంటే వాటిని వెంటనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు తరలిస్తామని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ డబ్బాలను వేర్వేరుగా డబ్బాల్లో వేసి సాగ్రిగేషన్ చేయాలని సూచించారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులను ఆదేశించారు. పూరిమెట్ల, ఈదర గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ రమణారెడ్డి

దర్శి: పట్టణంలోని అద్దంకి రోడ్డు పోలేరమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పోలేరమ్మ తల్లి దేవస్థానం అర్చకురాలు పరంకుశం హేమలత, దేవస్థానం చైర్మన్ కర్ల రమణారెడ్డిలు గురువారం తెలిపారు. ఆలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు పోలేరమ్మ తల్లి అమ్మవారి దేవస్థానంలో పుణ్యాహవాచన, విగ్నేశ్వర పూజ, వారాహి అమ్మవారి అభిషేకం, శ్రీ చక్ర కుంకుమ పూజ జరుగుతుందని, అనంతరం వారాహి అమ్మవారి హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వారాహి పూజ కార్యక్రమంలో పాల్గొనే వారు 90141 11123, 93816 49930, 86395 24116 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని కోరారు. భక్తులందరూ వారాహి పూజ కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లాప్‌మిత్ర కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న తాండవ రంగారావు

దర్శి: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య క్లాప్ మిత్ర కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. దరిశి సుందరయ్య భవనంలో అలూరి ఇస్సాయిల్ అధ్యక్షతన యూనియన్ జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. రంగారావు మాట్లాడుతూ 2020లో ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేల నెలకు వేతనం జీవోను అమలు చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులను 2017లో నియమించి మురికి కాల్వలు నీరు తొలగించడం, వీధులు శుభ్రం చేయడం, గృహాల నుంచి చెత్తని సేకరించి సంపద కేంద్రాలకు తరలించడం, వీధిలైట్లు పనులు, రోడ్లపైన చిల్ల కంప తొలగింపు తదితర పనులు కార్మికులు చేస్తున్నారని, ప్రజలను రోగాల బారిన పడకుండా గ్రామాల్లో సేవలు అందిస్తున్న వారికి నెలకు రూ.6 వేల వేతనం ఇవ్వడం అన్యాయమన్నారు. అవి కూడా నెల నెలా ఇవ్వకుండా 7 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరమైనా వేతనాలు పెంచకుండా నెలనెలా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వాలు మారినా పాలకుల విధానాల్లో ఏమీ మార్పు రాలేదని విచారం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను ప్రణంగా పెట్టి ప్రజలను కాపాడారని, వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో క్లాప్ మిత్ర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. యూనియన్ దరిశి మండల కార్యదర్శి చవలం గంగయ్య మాట్లాడుతూ మురికి కూపాల్లో మలినాల్లో నిత్యం పని చేస్తున్న తమకు వేతనాలు పెంచుతామని జీవో ఇచ్చి ఐదేళ్లయినా అమలు చేయలేదని మండిపడ్డారు. బూట్లు, గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, యూనిఫాం ఇవ్వాలని, వారంలో ఒక రోజైన సెలవు ఇవ్వాలని, కనీస వేతనాలు, బీమా సౌకర్యం ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ జరిగే సమ్మెలో దరిశి నియోజకవర్గ కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు చలమయ్య, గుంటు బాల గురవయ్య, అనోక్, ఇస్సాక్, విశ్రాంతమ్మ, అంజమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి దాతృత్వం



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న వెంకటరెడ్డి

దర్శి: మండలంలోని పాతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పాతకమూరు సర్పంచ్ ముచ్చుమారి వెంకటరెడ్డి విద్యార్థులకు గురువారం 100 ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాలలో తమ అనుభవాలు పంచుకున్నారు. విద్యార్థులతో వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు 40 స్పోర్ట్స్ డ్రెస్‌లు, కిట్స్ అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్, ఎస్ఎంసీ చైర్మన్ జి.బ్రహ్మారెడ్డి, పీడీ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



విత్తనాల ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: ఎరువులు, విత్తనాల దుకాణాల యజమానులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ హెచ్చరించారు. మండలంలోని జనత, మన గ్రోమోర్, విత్తనాల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అంటగట్టినా, అధిక ధరలకు విక్రయించినా షాపు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాపులో ధరల పట్టిక, స్టాక్ బోర్డు కనిపించేలా ఏర్పాటు చేయాలని ఏఓ ఆదేశించారు.

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

తాళ్లూరు: తాళ్లూరు–తూర్పుగంగవరం రోడ్లో ఏర్పాటు చేయనున్న భారత్ పెట్రోల్ బంకు నిర్మాణం కోసం స్థలాన్ని ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న గురువారం పరిశీలించారు. సర్వే నంబర్లు, ఇతర వివరాలు ఆమె పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ అనూష పాల్గొన్నారు.

యర్రగొండపాలెం నుంచి ఒంగోలుకు ఆర్టీసీ బస్సు

- ఎమ్మెల్యే తాటిపర్తికి కృతజ్ఞతలు తెలిపిన ప్రయాణికులు

యర్రగొండపాలెం: రోజూ ఉదయం 6.30 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఒంగోలుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ప్రారంభమైన ఈ సర్వీసు రామసముద్రం మీదుగా త్రిపురాంతకం, కురిచేడు, దర్శి, గంగవరం, చీమకుర్తి నుంచి ఒంగోలుకు చేరుతుంది. అక్కడ సాయంత్రం 6.30 గంటలకు ఆ బస్సు బయల్దేరి యర్రగొండపాలెం చేరుతుంది. నియోజకవర్గ కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి బస్సు ఏర్పాటు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆర్టీసీ అధికారులతో చర్చించారు. ఈ మేరకు వారు బస్సు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి నేరుగా వెళ్లే అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు ఈ ప్రాంతం ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు ఐకమత్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలల్లో వైఎస్సార్ సీపీపై అంతులేని అభిమానం ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన కొనసాగించినప్పుడే ప్రజలు స్వాగతిస్తారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలలను ఎప్పటికప్పుడు గుర్తించి, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడేందుకు సిద్ధమైందన్నారు. నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, కాతా నరసింహారెడ్డి, బాదం గోపాల్, పాలుగుళ్ల నరసింహారెడ్డి, స్వామి రంగారెడ్డి, గోడి వెంకటేశ్వరరెడ్డి, పోలెపల్లె శివ, మిత్రా రెడ్డి, కుక్కా సాంబ, బొర్రా కృష్ణారెడ్డి, ఓబులేసు, బ్రహ్మయ్య, ఎం.శ్రీను, దప్పిలి భాస్కర్ రెడ్డి, కుక్కా మల్లికార్జున, దాసరి వెంకటసుబ్బయ్య, జక్కా శ్రీను, అల్లం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయానికి ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: స్థానిక ఎంఈవో కార్యాలయానికి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఇన్వర్టర్‌ను గురువారం అందజేశారు. దాదాపు రూ.30 వేల విలువ చేసే ఈ ఇన్వర్టర్‌ను 2016 బ్యాచ్‌కు చెందిన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, మేకల శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, భానుప్రకాష్, నాగరాజు నాయక్, కిశోర్, సాయినితీష్, విజయ్‌కుమార్ నాయక్‌లు ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్‌లకు అందచేశారు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినప్పటికీ తమ కార్యాలయానికి వారు ఇన్వర్టర్ అందజేయడం హర్షించదగిన విషయమని, వారిని ఎంఈవోలు అభినందించారు.

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

- ఎన్నికల వేళ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
- కూటమి ప్రభుత్వానికి ఎస్టీయూ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

కంభం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిలబెట్టుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య డిమాండ్ చేశారు. కంభం మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి ఏపీజీఎల్ఐ, జెడ్పీ పీఎఫ్, సర్వీస్ రెగ్యులైజేషన్, మెడికల్ బిల్లులు తదితర సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు 9.30 గంటలకు పూర్తి చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం వల్ల మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న అందరికీ వర్తించేలా ఉన్న ఆప్షనల్ హాలిడేస్ విధానాన్ని 50 శాతం మందే వినియోగించుకునేలా ప్రస్తుత కమిషనర్ ఆదేశాలివ్వడం సరికాదన్నారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి డి.సిద్దిక్, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షఫీ, అంకయ్య, అర్ధవీడు మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాబా అఖండ పారాయణం పూర్తి



సాయి జీవిత చరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

మార్కాపురం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గత నెల 26వ తేదీ నుంచి 600 మంది భక్తులతో నిర్వహించిన బాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కృష్ణమోహన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో మోటారు కేబుల్ చోరీ

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు గ్రామ వ్యవసాయ భూముల్లో ముగ్గురు రైతులకు చెందిన డీప్ బోర్ల విద్యుత్ కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఉదయగిరి బాలయ్య, మోర్తాల రమణయ్య, మొగుళ్లూరి భీమయ్యకు చెందిన డీప్ బోర్ల విద్యుత్ కేబుల్ కత్తిరించి తీసుకెళ్లడంతో వారు లబోదిబోమంటున్నారు. మోటార్లు యథాప్రకారం పని చేయాలంటే మళ్లీ వ్యవప్రాయాసాలకు గురి కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.